ప్రజల మాట ప్రగతి బాట

# ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- రేపు స్క్రూట్నీ... 15న ఉపసంహరణ..
- అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- జిల్లాలో మొత్తం 12,16,796 మంది ఓటర్లు
- 1,295 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ శాసన సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించామని, 10వ తేదీతో గడువు ముగిసిందని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జాతీయ ఎన్నికల పరిశీలకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 147 మంది అభ్యర్థుల నుంచి 215 నామినేషన్ల సెట్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరించారన్నారు. ఈ నెల 13న నామినేషన్ల స్క్రూట్నీ అనంతరం పోటీకి అర్హత ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించి వారి నుంచి ఉప సంహరణలకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 15వ తేదీ మధ్యాహ్నం వరకు ఉప సంహరణకు అవకాశం ఉందని తెలిపారు. పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థుల అనంతరం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి వారికి ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించడంతో పాటు బ్యాలెట్‌లో గుర్తుల ముద్రణకు పంపిస్తామని తెలిపారు.

### జిల్లాలో మహిళా ఓటర్లే అధికం..

జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ వరకు ఓటు కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని వారితో కలిసి జిల్లా వ్యాప్తంగా 12,16,796 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులు 5,89,165 మంది, స్త్రీలు-6,27,553 మంది, ట్రాన్స్ జెండర్లు-78, ఎన్‌ఆర్‌ఐ-154, సర్వీస్ -684, దివ్యాంగులు – 25,807, సీనియర్ సిటిజన్స్-16,782 మంది ఉన్నారని తెలిపారు. 18-19 ఏళ్ల మధ్య ఉన్న యువ ఓటర్లు 4.06 శాతంతో 49,396 మంది ఉన్నారని అన్నారు. అత్యధిక యువ ఓటర్లు ఉన్న జిల్లాగా తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు.

### పోస్టల్ బ్యాలెట్లు వీరికే....

జిల్లాలో, ఇతర జిల్లాలో ఎన్నికల విధులు, ఇతర అత్యవసర సేవలు, దివ్యాంగులు, వృద్ధులు తదితర విభాగాలలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్ల్ కోసం అవసరం ఉన్న వారికి జారీ చేస్తున్నామని తెలిపారు. వీరిలో ఎన్నికల విధులలో ఉన్న పీవోలు, ఏపీవోలు 3,186, ఓపీవోలు 3,005, పోలీస్ సిబ్బంది 1,605, 15వ బెటాలియన్ 227, జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది 86, ఇతర జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు 16 మందికి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీరందరు వారి శిక్షణ సమయం ముగిసిన తరువాత అక్కడే ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లలో వేయాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా దివ్యాంగులు, వయోవృద్ధుల కేటగిరిలో ఏవీఎస్‌సీ 965, ఏవీపీడీ 669, ఏవీఈఎస్ 981 మంది నుంచి పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా తమ పరిధిలో ఉన్న ఆర్‌వో కార్యాలయాలతో పాటు దివ్యాంగులు, వయోవృద్ధుల ఓట్లను నేరుగా ప్రత్యేక సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి ఓటును వేయిస్తారని తెలిపారు. దీనిని పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రత్యేక వాహనంలో ఈవీఎంలను ఏర్పాటు చేసి పూర్తి భద్రతల మధ్య ఓటును వేయిస్తామని తెలిపారు.

### 90శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్..

జిల్లా ఉన్న 1,456 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రత్యేక వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలన చేస్తామని తెలిపారు. వాటిలో ప్రధానంగా 1295 కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రత్యేక టీవీల ద్వారా పరిశీలన చేస్తామని తెలిపారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో అక్కడ సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన కేంద్రాల వద్ద వీడియో రికార్డింగ్ ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలలో 390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. వాటి వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### అక్రమ రవాణాకు చెక్..

జిల్లా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చెక్ పోస్టుల ద్వారా అక్రమ రవాణాలకు చెక్ పెడుతున్నామన్నారు. ఇప్పటికే రూ.5,01,58,457 నగదు సీజ్ చేశామని వాటిలో సరైన ఆదారాలు చూపించిన వారి నగదును విడుదల చేశామన్నారు. 35,313.3 లీటర్ల మద్యం స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. రూ. 1,10,61,486 విలువ గల 437.035 కేజీల గంజాయిని సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా అనుమతులు లేకుండా అమ్ముతున్న రూ.18,12,116 విలువ గల 1974 క్రాకర్స్, రూ.1,24,074 విలువ గల సెల్ ఫోన్స్-9, రూ1,77,000 విలువ గల స్టీల్ బాక్స్‌లు, మరో రూ. 6,27, 310 విలువ చేసే 433 క్రాకర్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే టవల్స్-8205, చీరలు, చున్నీలు, ఇతర వస్త్రాలు 17 టన్నుల వరకు ఉన్నాయని వాటి విలువ రూ.8,61,260 వరకు ఉంటాయన్నారు. రూ.76,000 వేల డ్రస్ మెటిరియల్స్-400, గోడ గడియారాలు 9,570 వాటి విలువ రూ.46,89,300వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా 22 క్రాకర్స్ పెట్టలే 1 బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటికి సంధించిన సరైన ఆదారాలు ఉంటే వెంటనే అప్పగిస్తామని తెలిపారు.

### ఎన్నికల పరిశీలకులు వీరే..

భారత ఎన్నికల సంఘం ఆదేశాలలో జిల్లాలో సాధరణ ఎన్నికల పరిశీలకులు, వ్యయ ఎన్నికల పరిశీలకు వచ్చారని తెలిపారు. వారిలో ఖమ్మం, పాలేరు సాధరణ ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారులు ఒడిస్సాకు చెందిన తుశార్ కాంత మహంతి ఐఏఎస్-సెల్-9346293006, మధిర, వైరా నియోజకవర్గాలకు సాధరణ ఎన్నికల పరిశీలకులుగా రాజస్థాన్‌కు చెందిన కానారామ్-సెల్-9398560944, సత్తుపల్లి నియోజకవర్గానికి సత్యేంద్ర సింగ్-సెల్-9398559986లను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. అదేవిధంగా వ్యయ పరిశీలకులుగా ఐఆర్‌ఎస్ అధికారులు ఖమ్మం, పాలేరుకు కునాల్‌కుమార్-9398598148, మధిర సత్తుపల్లి, వైరాకు రాజీవ్‌కుమార్ సింగ్-సెల్-8919385028లను నియమించిందన్నారు. శాంతి భద్రల పరిశీలకులుగా ఐపీఎస్ అధికారులు ఖమ్మం, పాలేరుకు బ్రిజేష్‌కుమార్‌రాయ్-సెల్-8763294346, మధిర, వైరా, సత్తుపల్లికి మంజునాథ్.హెచ్-సెల్-9498144544లను ఎన్నికల సంఘం నియమించిందని వివరించారు. ఈ మీడియా సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నియామకం పొందిన పరిశీలకులతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఎఫ్‌వో విక్రమ్‌సింగ్ సిదార్థ, జిల్లా నోడల్ అధికారులు, ఫ్లాయింగ్ స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ క్యాడర్ ఖాళీ

- ఉమ్మడి జిల్లాలో ‘హస్తం’.. అస్తవ్యస్తం
- కొనసాగుతున్న బీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం
- తాజాగా ‘గులాబీ’ బాటలో సంభాని, కోడూరి, నాగమణి
- ఎన్నికల ప్రచారంలోనూ వెనుకబడిన కాంగ్రెస్
- సరైన మార్గదర్శకత్వం లేక తలలు పట్టుకుంటున్న కింది కేడర్

ఖమ్మం, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కేడర్ ఖాళీ అవుతున్నట్లు కనిపిస్తున్నది. ఆ పార్టీ అధిష్ఠానం వైఖరితో కాంగ్రెస్ పార్టీ నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భటి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు వైఖరికి విసిగి వేసారి పది నియోజకవర్గాల పరిధిలోని పార్టీకి చెందిన ఎంతోమంది నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ‘గులాబీ’కి మద్దతునిస్తున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో పాటు అనేక మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

### కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ..

బీఆర్‌ఎస్‌లోకి వలసలు పెరుగుతుండడంతో ‘ఖమ్మం కాంగ్రెస్’కు కోలుకోలేని షాక్ తగిలింది. దీనిలో భాగంగా



మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనుచరుడు, ఓయూ విద్యార్థి జేఏసీ నేత మానవతారాయ్‌తో పాటు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కీలక నేత ఎడవెల్లి కృష్ణ, వైరా నియోజకవర్గం నుంచి కీలక నేత రాంచందర్‌నాయక్ శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ చేరికల సంగతి మరువక ముందే సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క వర్గీయురాలు, ములకలపల్లి జడ్పీటీసీ సున్నం నాగమణి, కాంగ్రెస్ పార్టీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు, సత్తుపల్లికి చెందిన నేత కోడూరి సుధాకర్ శనివారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరి షాక్ ఇచ్చారు. వీరిలో సున్నం నాగమణి అశ్వారావుపేట నియోజకవర్గం టికెట్ ఆశించి భంగపడ్డారు. అలాగే పంచాయతీశాఖలో డివిజనల్ ఇంజినీర్ కొలువుకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన కోడూరి సుధాకర్ సత్తుపల్లి నుంచి టికెట్ ఆశించి నిరాశ చెందారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించినా పార్టీ గుర్తించలేదని, బీఆర్‌ఎస్‌తోనే తమ రాజకీయ భవిష్యత్తు ఉంటుందని గుర్తించి బీఆర్‌ఎస్‌లో చేరామని వారు ప్రకటించారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో తాతా మధు నేతృత్వంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాచలం డివిజన్ సీనియర్ నాయకులు రావులపాటి రాంప్రసాద్, భద్రాచలం బీజేపీ టికెట్ ఆశించిన వెంకటాపురం ఎంపీపీ సతీశ్, సీపీఐ మండల కార్యదర్శి సునీల్, పలువురు సీపీఐ నాయకులు చేరారు. వరుస చేరికలతో ఉభయ జిల్లాల పరిధిలో కాంగ్రెస్ పార్టీ మరింత డీలా పడినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే బీజేపీ నేత ఊకే అబ్బయ్య, టీడీపీ నేత జీవన్‌కుమార్ కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు.

### పార్టీలో చేరిన వారికి దిశానిర్దేశం..

ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. అభ్యర్థులు అప్పటి నుంచి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పొద్దు లేచిన దగ్గర్నుంచి ప్రజల మధ్యే ఉంటున్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల ప్రచారంలోనూ వెనుకబడే ఉన్నది. సరైన మార్గదర్శకత్వం లేక కింది కేడర్ తలలు పట్టుకుంటున్నది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికీ దిశానిర్దేశం చేస్తున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఉభయ జిల్లాల పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచిస్తున్నారు. వారిని ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నారు.

# రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

## కారేపల్లి ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

కారేపల్లి (కామేపల్లి), నవంబర్ 11: రాబోయేది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ స్పష్టం చేశారు. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మరిన్ని పథకాలు అందించడంతోపాటు మ్యానిఫెస్టోలోని హామీలను కూడా అమలుచేయనున్నట్లు చెప్పారు. అతి తక్కువ కాలంలోనే ఇల్లెందులో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని అన్నారు. నియోజకవర్గాన్ని ఇంతలా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. మరోసారి కేసీఆర్ సీఎం కాగానే.. మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామని అన్నారు. నూతన మ్యానిఫెస్టో అమల్లోకి రాగానే అర్హులందరికీ మరిన్ని ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. కామేపల్లి మండలంలో శనివారం పర్యటించిన ఆమె.. జోగ్గూడెం, ఊట్కూర్, కామేపల్లి గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం మొత్తానికి 4 వేల ఇళ్లు మంజూరు కాగా కామేపల్లి మండలానికి 916 ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. ఇంకా 2 వేల ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పారని, ఈలోపు ఎన్నికల కోడ్ రావడం వల్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయిందని, కోడ్ ముగియగానే ఆ ఇళ్లు కూడా మంజూరవుతాయని వివరించారు. కేసీఆర్‌ను మూడోసారి కూడా సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ధనియాకుల హన్మంతరావు, తీర్థాల చిదంబరం, అజ్మీరా విజయలక్ష్మి, ఆంతోటి అచ్చయ్య, జర్పల భగవాన్, బట్టు శంకర్, జర్పల రామోజీనాయక్, కొనంచి శంకర్, ఏపూరి పాపారావు, అజ్మీరా బన్సీలాల్, రాయల వెంకటేశ్వర్లు, ఎడ్లపల్లి శేషగిరి, బానోత్ రవి, వడియాల కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గుగులోత్ సునీత, మూడు రాధ, జాటోత్ జాయిలూసీ, మల్లెంపాటి నర్సింహరావు, కృష్ణప్రసాద్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, రామోజీనాయక్, వీరన్న పాల్గొన్నారు.